డిటెక్టివ్ కథ

# రాంకేశవమ్

ఎమ్.వి.వి. సత్యనారాయణ

''రావ్, కేశవ్ యిద్దరూ కవలలు. వాళ్ళను గుర్తుపట్టు కోవడం కష్టం. నువు వాళ్ళకిద్దరికీ ఎలా సేవ చేయగలవో చూసుకోమరి!'' అన్నాడు దివాన్.

గంగయ్య వింటున్నాడు. ఇక్కడ ఎస్టేట్‌లో నౌకరీ పని వున్నదని తెలిసి యిటువచ్చాడు. బతికినంత కాలం తాను ఎటూ బతకడు. ఎక్కడో యింత తిని పొట్ట పోసుకుంటూ కాలక్షేపం చేస్తేచాలు అన్నట్టుగావుంది తన పరిస్థితి.

దివాన్ తోటమాలిని పిలిచి అవుట్ హవుస్‌కి పంపించాడు. గంగయ్య తన బిచాణాతో తోటమాలిని వెంబడించాడు.

అవుట్ హవుస్‌లో నాలుగు గదులున్నాయి. మూడు గదులలో తోట మాలి, మరో పనివాడూ కుటుంబాలతో సర్దుకుని వుంటున్నారు.

''ఇదే నీగది! నీపేరేమిటన్నావ్?'' అడిగాడు తోటమాలి. గంగయ్య చెప్పాడు. తోటమాలి వెళ్ళిపోయాక పక్క సర్దుకున్నాడు. ఆలోచించుకుంటూ నడుమువాల్చాడు. కొత్తచోటు కావడంవలన కళ్ళు మూతలు పడనంటున్నాయి.

అర్ధరాత్రి పన్నెండవుతోంది. భవనంలో యింకా లైట్లు వెలుగుతున్నాయి. పెద్దగేటు తెరచుకుంటోంది. కారులోపలికి వచ్చాక తిరిగి గేటుమూసుకుంది. గంగయ్య లేచి కూర్చుండి కిటికీలోంచి చూస్తున్నాడు. కారు తలుపు తెరచి పట్టుకున్నాడు కారు డ్రైవర్.

ఇద్దరు యువకులు దిగారు. ఆవరణలో ప్రకాశవంతమైన లైట్లు వెలుగుతున్నాయి. ఇద్దరు యువకులలో ఒకరు ఎర్రటి జెర్కిన్ వేసుకున్నారు. రెండోవారు నీలం జెర్కిన్ వేసుకున్నారు. తెల్లపాంటులు ధరించడం వలన ఆ రంగులు మరింత ముదురుగా కంటికి నదురుగా కనిపిస్తున్నాయి.

గంగయ్య కళ్ళు చికిలించుకుని చూశాడు.

ఇద్దరూ అచ్చంగా ఒకే ఆకారంతో, ఒకే ముఖ కవళికలతో వున్నారు. ఒకరిని చూచి ఒకరిని చూడ నక్కరలేదు. వాళ్ళలో ఎవరిని ఎవరిగా అయినా పొరబడే అవకాశం వారి తలిదండ్రుల కయినా వుంటుంది.

గంగయ్య నిట్టూర్చాడు. ఈ కవలల దగ్గర తన జీవితశేషం వెళ్లమారిపోతేచాలు! తనకా వెనకాముందు ఎవరూలేరు. పక్కమీద వాలి ఆలోచనలో పడ్డాడు. భవనంలో యింకా హడావుడిగానే వుంది.

పనివాళ్ళు కంగారుగా తిరుగుతున్నారు. గంగయ్యకు ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. పనివాడొకడు అతడని లేపాడు.

''రా!రా! ఎక్కడిపని అక్కడే వుండిపోయింది!'' అన్నాడు పనివాడు.

గంగయ్య బద్ధకంగా ఆవులించి అతడి వెంట నడిచాడు.

పదిగంటల ప్రాంతంలో కవలలో ఒకరు ఎదురయారు. గంగయ్య నమస్కారం పెట్టాడు. అతడు తెల్ల బట్టలతో వున్నాడు.

''కొత్తగా చేరావ్ కదూ!'' అన్నాడు.

''అవునండి!''

అతడు తలవూపి ప్రక్కగదిలోకి వెళ్ళాడు.

''ఆయనెవరు? రావ్‌గారా? కేశవ్‌గారా?'' పని వాడిని అడిగాడు గంగయ్య.

''కేశవ్ గారు!'' అన్నాడు పనివాడు.

మరో గంటతర్వాత నడవాలో కవలలలో మరొకరు ఎదురయారు. గంగయ్య నమస్కారం పెట్టాడు.

''ఇందాక పలకరించాను కదోయ్!'' అన్నాడతడు.

గంగయ్య సిగ్గు పడ్డాడు. ఈయన కూడా తెల్లదుస్తులలో వుండి వుంటే కేశవ్ అనుకునేవాడే! ఈయన తెల్ల పాంటుమీద పువ్వుల చొక్కా వేశారు. కేశవ్‌గారే చొక్కా మార్చు కున్నారన్నమాట!

గంగయ్య యిదేదో తేల్చు కోవాలనుకున్నాడు. కవలల కోసం వెతికి పట్టుకున్నాడు. ఇద్దరూ డ్రాయింగ్ రూంలో వి.సి.ఆర్ ముందు కూర్చున్నారు. క్రికెట్ మాచ్ చూస్తున్నారు. గంగయ్య చాటునుండి యిద్దరినీ గమనించాడు.

ఈసారి అతడు మరల తెల్లబోయాడు.

ఇద్దరూ పువ్వుల చొక్కాలే వేసుకున్నారు. వాళ్ళలో రావ్ ఎవరు? కేశవ్ ఎవరు? ఇద్దరూ పువ్వుల చొక్కాలే ఎందుకు ధరించారు? ఇంతకూ యిందాక తనకు ఎదురయింది యిద్దరిలో ఎవరు? ఇద్దరూ ఒకేరకం దుస్తులు వేసుకుంటే ఎవరయినా ఎలా గుర్తుపట్టగలరు?

## 2

ప్రిన్స్‌లాడ్జ్. సాయంత్రం నాలుగు గంటలు అవుతోంది

"కేశవ్! నాన్నగారితో మాట్లాడతా నన్నావు......" అతడి ఛాతీ నిమిరింది జ్యోతి.

అతడు నవ్వి ఆమె చెయ్యి అందిపుచ్చుకున్నాడు. ఆమె పులకరిస్తోంది. అతడు ఆమెను ఛాతికేసి అదుముకున్నాడు. ఆమె నవ్వింది.

"మీ నాన్నగారితో ఏం మాట్లాడాలి?"

"నానోటితో చెప్పించాలనా?" ఆమె నవ్వు ఆపింది.

"వూ!"


"ఏం మాట్లాడతావ్?"

నేనుకాదు నువ్వు., మన పెళ్లి విషయం!"

"నువు మాట్లాడ లేదా?"

"ఆడపిల్లను. నేనేం మాట్లాడ గలను?"

"ప్రేమించగలిగిన దానివి మాట్లాడలేవా?"



"నిన్ను చూసీ చూడంగానే ప్రేమించాను. అందుకే కదా నీకు అలుసైపోయాను!" ఆమె బుగ్గలో కెంపులు పూశాయి.

ఆమెను బెడ్ మీదకు తోశాడు. మీద పడ్డాడు. అతడిని వెనక్కి నెట్టెయ్యాలని ప్రయత్నించింది జ్యోతి. ఆమె కంటె బలంగా ఆమెను స్వాధీనం చేసుకున్నాడు. అతడి చేష్టలు ఆమెను గిలిగింతలు పెడుతున్నాయి.

ఆమెకు అతడి ప్రయత్నం దేనికో అర్థం అయిపోయింది.

"వద్దు...వద్దు...మనం పెళ్ళవకుండా యింత దగ్గరవడం ప్రమాదం.." ఆమె విడిపించుకోబోయింది.

అతడు వీలు కుదరనివ్వలేదు. మరింత బలంగా పట్టుకుని ఆమె పెదిమ లందుకోబోయాడు. జ్యోతి అతడిని చెంప మీద కొట్టింది. అతడు రెచ్చిపోయాడు. ఆమె చేతులందుకున్నాడు. కిందకు తిరగతోసి జ్యోతిని ఆక్రమించుకోసాగాడు.

ఆమె రొప్పుతోంది. ఆవేశపడుతోంది. కేకలు పెడుతోంది. పెనుగులాడుతోంది. ఆమె దుస్తులు పీలిక లయ్యాయి. చేతులూ, చెక్కిళ్ళూ, యితర భాగాలూ అతడి గోళ్ళు గుచ్చుకుని ఎర్రబడ్డాయి. ఎరుపు చూచి అతడు మరీ రెచ్చిపోయాడు.

లేడిని కబళించే చిరుతలాగా, ఆమెను పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు.

జ్యోతి గోడవైపు తిరిగి ఏడుస్తోంది. చిరిగిన దుస్తులు ఒంటిమీద కప్పుకోవాలనిగానీ, తలెత్తి తన సర్వస్వం దోచుకో గలిగిన వాడిని చూడాలనిగానీ ఆమెకు తోచడం లేదు. తన బతుకు ఏమవుతుందోనని కుళ్ళి కుళ్ళి

ఏడుస్తోంది. తాను పొరబడి లొంగిపోయింది. తాను పొరబడి లాడ్జికి వచ్చింది.

అతడు మెల్లగా లేచాడు. బాత్ రూంలోకి వెళ్ళి తిరిగి వచ్చాడు. తిరిగివచ్చి బట్టలు కట్టుకున్నాడు. ఆమె దగ్గర చేరాడు.

"థాంక్స్!" అన్నాడు.

"ఒక పరిపూర్ణమైన కన్యగా, పెద్దల అనుమతితో నీ సొంతమవ్వాలనీ, నీతోనే నా బతుకు పంచుకోవాలనీ కలలు కన్నాను. కానీ...ఇప్పుడు...నువు చేసిందేమిటి? మనం ఘోరమైన తప్పుచేశాం...".

"అవును".

"ఏమవును? ఆడదాని బాధ నీకేమిటి తెలుస్తుంది?"

"అవును!"

"ఏమిటవును? మగాడిని నీకేం?"

"అవును నేను కేశవ్‌ను కూడా కాదు పాపం."

ఆకాశం విరిగి నెత్తిన పడ్డట్టూ, కాళ్ళకింద నేల కదలుతున్నట్టూ జ్యోతి వణికి పోయింది.

"ఏ...మి...టి...ను...వ్వ...నే...ది?"

"అవును జ్యోతీ! నేను రావ్‌ను. నువు ప్రేమించిన కేశవ్‌ను కాను!"

"ఆ!"


"నా సోదరుడు ప్రేమించిన అమ్మాయి ఎలా వుంటుందో చూడాలనిపించింది. అంతే! చూశాను. ఓహ్......గొప్ప అనుభవం!"

జ్యోతి యింకా నమ్మలేనట్టు చూస్తోంది.

అతడు భుజాలు చరుచుకుని బయటకు కదలబోయాడు. ఆమె చటుక్కున లేవబోయింది. తాను నగ్నంగా వున్నట్టు గుర్తొచ్చింది. సిగ్గుపడి దుప్పటి లాక్కుంది. బెడ్ దిగింది. అతడికి అడ్డంగా పరుగెత్తింది.

"మరల రేప్ చెయ్యమంటావా?" అడిగాడతడు.

ఆమె నిశ్చేష్టురాలయిపోయింది. ఆమెను కిందనెట్టి ఆమెమీద నుండి కాళ్ళుచాపి గడపలో నిలబడ్డాడు.




"నా సోదరుడికి నేను చెప్పనులే—నీ శీలం పోయిన సంగతి! నువు చెప్పుకుంటే చెప్పుకో! నీయిష్టం!" అంటూ అతడు పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

## 3

"సార్!సార్!" పిలిచాడు లాల్ జైన్

అతడు కారాపాడు

"రావ్ జీ! నమస్తే!"

"నమస్తే...ఎవరు మీరు?"

లాల్ జైన్ ఆశ్చర్యపోయి, "సార్ మీరు రావ్ గారా? కేశవ్ గారా?" అన్నాడు.

"మీకెవరు కావాలి?"

"రావ్ గారు."

"అయితే నేను 'కేశవ్'ను."

లాల్ జైన్ నోరావులించి చూచి, "సార్! అలా అనకండి సార్! నేను అన్యాయమైపోతాను!" అన్నాడు.

"ఏం? ఎందుకు? రావ్ నీకు ఏమయినా యిస్తా నన్నాడా?"

"నా వద్దనే ఆయన వజ్రాల నెక్లెస్ తీసుకు వెళ్ళారు సార్! చెక్కు యిచ్చారు. బాంకులో అంత డబ్బు లేదన్నారు. చెక్కు తిరిగి వచ్చింది!"

"వాడు ఎవరి దగ్గరా అరువు తీసుకోడు!"

"ఏం చేస్తాంసార్! ఒక్కోసారి చేయకూడదనుకున్న పని చేసేస్తాం!"

"సరే...రావ్‌తో చెప్పి నీ డబ్బు పంపించెయ్యమని చెబుతాన్లే!"

"యాభైవేలు సార్!"

"వేలు కాకపోతే లక్షలు! కానీ అయినా వుంచుకోడు రావ్." అంటూ కారు రివర్స్ చేశాడు అతడు.

లాల్ జైన్‌కి ఏం చేయాలో తోచలేదు. షాపులోంచి మేనేజర్ పరుగెత్తుకు వచ్చి, "వాళ్ళిద్దరూ అంతేసార్. కవలలు సార్! మనుషులను తికమక పెట్టి సంతోష పడతారు. మాయింటి ప్రక్క జ్యోతి అని ...చెప్పుకు పోతున్నాడు.

లాల్ జైన్‌కి అతడి మాటలు చెవిన పడటం లేదు. కవలల్లో ఎవరికి తాను యాభై వేల రూపాయిల విలువైన వజ్రాల హారం యిచ్చినట్టు? ఎలా తెలుస్తుంది? పైగా వాళ్ళిద్దరూ కూడ బలుక్కున్నట్టు కూడా అర్థమవుతోంది. తన డబ్బు తిరిగి వస్తుందా?

ఆ సాయంకాలం లాల్ జైన్ బంగళాకు వచ్చాడు. కవలలు లాన్‌లో కూర్చున్నారు. ఫోటో ఆల్బం చూస్తూ మాట్లాడు కుంటున్నారు.

"సార్!" అన్నాడు లాల్ జైన్.

ఇద్దరూ అతడిని అప్పుడే చూచినట్లు నటించారు.

"సార్! మీలో రాం ఎవరు?"

"ఏం?" అన్నారిద్దరూ వొకేసారి. ఒకేరకం ముఖ కవళికలూ, ఒకేరకం హావభావాలూ, చివరికి ఒకేరకం దుస్తులూ...

"నావద్ద నుండి యాభైవేల రూపాయిల విలువ చేసే వజ్రాల హారం తీసుకు వచ్చారు మీలో వొకరు. నాకు నా డబ్బు ఇప్పిస్తే చాలుసార్!"


"ఎవరు ఎవరో తెలుసుకోకుండా యాభైవేల రూపాయిల నగ అరువిచ్చారా?" విచిత్రంగా వుంది." అన్నారు యిద్దరిలో ఒకడు.

రెండోవాడు నవ్వాడు.

లాల్ జైన్ యింకా అయోమయంగా చూచి, "సార్! నన్ను అన్యాయం చెయ్యకండి సార్! అసలే నా వ్యాపారం నష్టాల మీద నడుస్తోంది!" అన్నాడు.

"ఇలా బుర్ర లేకుండా వాగేవాడికి వ్యాపారంలో నష్టాలే వస్తాయి! నాకు నువు వజ్రాల హారం ఇవ్వలేదు. సరేనా?" అన్నాడు ఒకడు.

"నాకు మాత్రం ఎక్కడిచ్చావు? ఎప్పుడిచ్చావు?



అన్నాడు రెండోవాడు.

"బాబుల్లారా! నాదగ్గర అప్పు బిల్లుమీద సంతకం పెట్టారు. మీరిద్దరూ మీమీ సంతకాలు పెడితే గుర్తుపట్టగలను!"

వాళ్ళిద్దరూ తలలూపారు. అతడు కాగితం కలం అందించాడు. వాళ్ళు ఒకరి తర్వాత ఒకరు సంతకాలు పెట్టారు.

గంగయ్య ట్రేలో కాఫీ కప్పులు పెట్టుకొని వచ్చాడు.

## 4

గంగయ్య లైటు వెలిగించి మెట్లు ఎక్కాడు. హాలులో గడియారం ఒక గంట కొట్టింది. గంగయ్య లైటు వెలుతురులో గడియారం వైపు చూశాడు.

ఒంటి గంటన్నర అయింది. ఈ రాత్రికి యింట్లో వుండమన్నారు కవలల్లో ఒకరు. ఒక పనిమనిషి సెలవు పెట్టాడు.

తనకు చెప్పింది ఎవరు? రామ్?కేశవ్? ఏమో యింకా వాళ్లలో ఎవరు ఎవరో తనకు తెలియదు. ఎవరయితే తనకేం? ఇద్దరిలో ఒకరు. ఇద్దరు యింటి యజమానుల్లో ఒకరు

మేడమీద చప్పుడయింది. నిద్రలో తనకు మెలకువ వచ్చింది. మేడమీద గదిలో ఎవరో వేగంగా నడిచినట్టు శబ్దమయింది. ఎవరది? ఎక్కడో భళ్ళున అద్దం పగిలింది.

గంగయ్య నడవాలో పరుగెత్తాడు. కవలల్లో రామ్ గది తలుపు తెరచి వుంది. దాని ప్రక్కనే కేశవ్ గదితలుపు యింకా మూసివుంది. రామ్ గదిలోకి ప్రవేశించాడు గంగయ్య. తోటవైపు వున్న గాజు కిటికీ పగిలిపోయివుంది. గచ్చుమీద పెంకులు పడివున్నాయి.


గదిలో దీపం వెలుగుతోంది. పందిరిమంచం మీద మరో తెర అడ్డు తప్పుకుంది. రామ్ వెల్లకితల పడి వున్నాడు. అతడితల మంచం అంచుకు వచ్చి వుంది. దుస్తులమీద రక్తంచింది వింత డిజైన్‌గా మెరుస్తోంది. మనిషి గిలగల కొట్టుకున్నట్టుగా ప్రక్కబట్టలు చెదిరిపోయి వున్నాయి. గుండెల్లో దిగేసినట్టు యింకా కత్తి అలాగేవుంది. ఎముకలను ఒత్తిగించుకుంటూ శరీరంలో దిగిన ప్రాంతం నుండి నెత్తురు కారికారి గడ్డకట్టివుంది. కిందనుండి వుబుకుతున్న రక్తానికి కాబోలు గడ్డ కొద్దిగా కదులుతోంది.

గంగయ్యకు కళ్ళు పచ్చబడ్డాయి. మొహం తిరుగుతోంది. రామ్ కళ్ళు పగిలిన పత్తికాయల్లాగా విడిపోయి వున్నాయి. గంగయ్య కాళ్ళు గడగడలాడి కింద కూలబడ్డాడు. కొంత సేపటికి శరీరం స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

కెవ్వున రముకుంటూ పరుగెత్తాడు. హడావుడిగా మెట్లు దిగుతూ కింద పడ్డాడు. పడినవాడు కింద మెట్టుమీదకు దొర్లాడు. భవనం మేల్కొంది. అవుట్ హవుస్‌లోంచి కూడా పనివాళ్ళు పరుగెత్తుకుంటూ వచ్చారు. గంగయ్యను లేవదీశారు.

"రామ్ బాబుగారిని ఎవరో చంపేశారు!" అరిచాడు గంగయ్య. అందరూ పైకి పరుగెత్తారు.

కేశవ్ గదితలుపు తెరచుకుని బయటికి వచ్చాడు.



శ్రీదేవి - విజయవాడ ఊయలముగ్గు.

బద్ధకంగా ఆవులించాడు.

"ఏమిటి? ఏమయింది?" అన్నాడు.

పనివాళ్ళు చెప్పారు. కేశవ్ మొహంలో రంగులు మారాయి. అతడు గాభరాగా రామ్ గదిలోకి దూకాడు.

"అన్నయ్యా," అన్నాడు కెవ్వున. తర్వాత గాజు కిటికీ వద్దకు పరుగెత్తాడు. బయటకు చూశాడు. వెలుపల చీకటి కాటుకలాగా పేరుకు పోయివుంది. దూరంగా ఎక్కడో మినుకు మినుకుమని వీధి దీపాలు కనిపిస్తున్నాయి. తిరిగి అన్నయ్య బెడ్ వద్దకు వచ్చాడు. పిచ్చిగా టెలిఫోన్ సెట్టు వద్దకు పరుగెత్తాడు.

"హలో...పోలీస్ స్టేషన్!" అన్నాడు కేశవ్.

ఒక పోలీసు పలికాడు. క్రయిమ్ బ్రాంచ్‌కి కనెక్షన్ యిచ్చాడు. అయిదు నిమిషాల తర్వాత పోలీసులు వచ్చారు.

## 5

"మీరెవరు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.




రమేష్

నన్ను జ్యోతి అంటారు సార్." అన్నదామె.

"చెప్పండి మీరు వచ్చిన పనేమిటో?"

"రామ్‌ను ఎవరో కత్తితో పొడిచారు. అతడిహత్య విషయంలో పోలీసులు నన్ను హంతకురాలిగా అనుమానిస్తున్నారు."

"రామ్ ఎవరు?"

జ్యోతి చెప్పింది.

"రామ్‌ను మీరు చంపినట్టుగా పోలీసులు అనుమానించడానికి ఆధారం ఏమిటి?"

"రాత్రి నేను వాళ్ల బంగళాకి వెళ్ళాను!"

"ఎన్ని గంటలకు?"

"రాత్రి ఎనిమి దయివుంటుంది? కేశవ్‌ను కలుసుకోవడానికి వెళ్ళాను. కేశవ్‌తో మాటలాడాను."

"ఏ విషయం మాట్లాడారో తెలుసుకోవచ్చునా?"

జ్యోతి మొహం మ్లానమయింది. "కేశవ్‌తో మాట్లాడాలని ఒక పనివాడితో చెప్పాను. పనివాడి పేరు గంగయ్య అట. అతడు నన్ను ఎగాదిగా చూశాడు. 'మీకు కేశవ్‌బాబుగారు ఎవరో చెప్పలేనుగాని వారి గదిలో మాత్రం కూర్చుండ పెట్టగలను!' అన్నాడు.

అతడు చూపించిన గదిలో కూర్చున్నాను. కొంత సేపటికి కేశవ్ ఆ గదిలోకి వచ్చాడు. ఏం చేస్తాను? అతడే కేశవ్ అనుకున్నాను. తలుపు మూసి వచ్చాడు.

"కేశవ్!" అని కూడా పిలిచాను మరి.

అతడు తలూపాడు కూడా. "ఏం ఇలా వచ్చావ్?" అన్నాడు.

"మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం? మా యింట్లో ఎప్పుడు మాట్లాడతావు? అన్నాను.

"మాట్లాడటానికేంలే, చూద్దాం!"

"మాయింట్లో యికమీదట నిన్ను కలుసుకోవద్దని ఆంక్ష పెడుతున్నారు."

"పెట్టనివ్! నిన్ను నాదాన్ని చేసుకోలేనప్పుడు కదా!" అంటూ అతడు నాచెయ్యి పట్టుకున్నాడు. పక పక నవ్వాడు. అప్పుడు గుర్తుపట్టాను. అతడు కేశవ్.

కాదు. రావ్.

"నిన్ను రెండోసారి రేప్ చేసే అవకాశం దొరుకుతుందనుకోలేదు. నేను అదృష్టవంతుడిని!" అన్నాడతడు."

జ్యోతి చెప్పడం ఆపి ఏడుస్తోంది. అరచేతులలో మొహం కప్పుకుని మరీ ఏడుస్తోంది.

ఆమెను వారించదల్చుకోలేదు. జ్యోతి గుండె బరువు దిగితే పూర్తిగా విషయం చెబుతుంది. తొందరేముంది?

పదినిముషాల తర్వాత ఆమె నెమ్మదించింది.

"తర్వాత మీరు యింటికి వచ్చేశారా?"

"లేదు సార్! ఆ గదిలోకి కేశవ్ వచ్చాడు."

"నువ్వా?" అన్నాడు కేశవ్.

నాజుత్తు రేగిపోయివుంది. చెక్కిలిమీద గోరు గాట్లు పడ్డాయి. దుస్తులు నలిగిపోయి వున్నాయి. నా పరిస్థితికి నేనే కుమిలిపోయాను. తప్పితే కేశవ్ నావైపు కనీసం సానుభూతితో కూడా చూడలేదు.

"కేశవ్! ఈ [illegible] నా బతుకును బుగ్గిచేశాడు!" అన్నాను రావ్‌ని చూపి.

రావ్ ఏమీ జరగనట్టు క్రాఫ్ దువ్వుకున్నాడు. కేశవ్‌ను దాటుకుని బయటకు వెళ్ళిపోయాడు. నేను పరుగెత్తుకుని వెళ్ళి అతడిని ఆపాలని చూశాను. కేశవ్ నా చెయ్యి పట్టుకుని ఆపాడు.

అతడు నిన్ను అనుభవించాడు. అందులో అతడి తప్పేమీ లేదు.

తెల్లబోయాను. అతడు రావ్‌మీద ఆగ్రహం తెచ్చుకోకపోగా రావ్‌ను సమర్థిస్తున్నాడు.

"కేశవ్! ఏమిటి నువు మాట్లాడేది? " అన్నాను.

"నీ ప్రియుడెవరో నీకు స్పర్శతో తెలియనంత దూరం వెళ్ళిపోయినట్టు మొన్న రుజువయింది. నీ శీలం పోయిన సంగతి మొన్ననే తెలిసింది. ఈ రోజు నీ ప్రియుడెవరో చూచికూడా నువు గుర్తుపట్టలేకపోయావు. అది నీతప్పు!"

"కేశవ్! మీయిద్దరూ అచ్చంగా ఒకే రకంగా వుంటారు. ఎలాగుర్తు పట్టగలను? అయినా కావాలని యిలా ఒక ఆడపిల్లను వేధించడం- శీలం దోచుకోవడం చేయగలరని ఎలా అనుకుంటాను? ఇదంతా చూస్తే నువు అతడికి సహకరించావనిపిస్తోంది."

కేశవ్ పకపక నవ్వాడు. "హ్హ...హ్హ...మంచి విషయం గ్రహించావు. అతడు నిన్ను కోరాడు. 'ఆమె నిప్పు!' అన్నాను-'నిప్పు అయితే తాకగానే కాల్తుందిలే! కాలితే మానేస్తాను!' అన్నాడు. నిన్ను తాకాడు. కాలలేదు. యిక నీమీద నేను ఆశపెట్టుకుని ఎలా కూర్చోగలను?"

ఆక్షణంలో కేశవ్‌ను మెడకొరికి చంపెయ్యాలనిపించింది. నేనే ఆడపులి నయివుంటే ఆ పని చేసేదాన్ని! కాని ఆడదాన్ని! రెండుసార్లు ఒకే మగాడిచేత వంచన పొందిన దాన్ని! నన్ను ప్రేమించిన వాడే నాలోని నిప్పును పరీక్షించమని సోదరుడిని పురికొల్పాడు.

పనివాడి చేత బయటికి నెట్టించాడు. నేను ఆ తర్వాత ఆ బంగళాకు వెళ్ళలేదు." ముగించింది జ్యోతి.

"రావ్ మిమ్మల్ని బలాత్కరించాడు. అతడిని ఏమీ చేయాలని మీకు తోచలేదా?"

"తోస్తేమాత్రం ఏం చేయగలను? యింట్లో చెప్పుకుంటే అవమానం! ఎవరికి తెలిసినా యిక మొహం ఎత్తుకునే పనివుండదు! ఆ రాత్రంతా కుమిలిపోయాను. వుదయాన పోలీసులు నన్ను తీసుకు వెళ్ళారు. మా నాన్నగారు యాంటిసిపేటరీ బెయిలుయిచ్చి విడిపించారు.

"నాన్నగారూ! నేను తప్పుచేశాను! నన్ను రక్షించండి. హత్యతో నాకు ఎలాంటి సంబంధమూ లేదు. నన్ను క్షమించండి...నన్ను నమ్మండి" అన్నాను.

నాన్నగారు పెదిమ విరిచారు. ఈ విషయంలో నేను ఏమీ చేయలేనమ్మా! జీవితంలో పోరాడిపోరాడి అలిసిపోయి వున్నాను! అన్నారు.

"నేను మీవద్దకు వచ్చాను!" అంది జ్యోతి.

డిటెక్టివ్ శిరీష్ అంతసేపూ పాయింట్స్ రాసుకుంటున్నాడు. ఆమె ముగించిన రెండు నిమిషాలకు తలెత్తాడు.

"మీరు మరల బంగళాకు వెళ్ళలేదు అవునా?" అన్నాడు.

"అవునుసార్! మరల వెళ్ళలేదు!"

"రావ్ మీద మరెవరికయినా కక్ష రేగివుండవచ్చు. వాళ్ళెవరో అతడిని కత్తితో పొడిచి వుంటారు.!"

"సార్! రావ్‌ని ఎవరు చంపారో నాకనవసరంసార్! నేను అతడిని హత్య చేయలేదు సార్! ఆవిషయం నిరూపించండిసార్! చాలు."

శిరీష్ నవ్వి తలూపాడు.

"మీ ఫీజు?" అడిగింది జ్యోతి.

"ముందు నువు ప్రమాదంలోంచి బయటపడు! తర్వాత చూసుకుందాం!"

ఆమె చేతులు జోడించింది.

శిరీష్ ఆమెను పంపించేసి, క్రయిమ్ బ్రాంచ్ కార్యాలయానికి ఫోన్ చేశాడు.

"అతడిని చంపింది జ్యోతే! నువ్వు ఆమెను రక్షించలేవు! హతుడి శవం క్రింద ఆమెకు సంబంధించిన జేబురుమాలు వుంది. రుమాలుమీద ఆమె పేరు కుట్టివుంది తెలుసా?" అన్నాడు క్రయిమ్ బ్రాంచ్ యిన్‌స్పెక్టర్ కుమార్.

"కత్తిమీద వేలిముద్రలు దొరికాయా?"

"లేవు. తుడిచేసింది."

"హత్య చేసిన వాళ్ళు తుడిచి వేశారని చెప్పు! జ్యోతి యింకా అనుమానితురాలే కదా!"

"పోనీ...అలాగే అనుకో!"


"నేనొకసారి వాళ్ళ బంగళాకు వెళ్తాను. నీకేం అభ్యంతరం లేదుకదా కుమార్!"

"లేదు శిరీష్! కేసుమొత్తం ఒక కొలిక్కి వచ్చేసింది!"

శిరీష్ నవ్వుకున్నాడు. మరోసారి టేబులుమీది వార్తాపత్రిక తీశాడు. రావ్ హత్య విషయం క్లుప్తంగా రాసి ఫోటో వేశారు. ఫోటోలో శవం గుండెల్లో యింకా కత్తి గుచ్చుకునేవుంది. రిసీవర్ పెట్టేశాడు.

రావ్ ఆజానుబాహువు అనే విషయం ఫోటోను బట్టి తెలుస్తోంది. పత్రికను భద్రపరచి కుర్చీలోంచి లేచాడు.

ముగింపు వచ్చేవారం



పావురాల ముగ్గు. యం.కె.డి.కుమార్.